


# ప్రియురాలు పిలిచె

– డా.యండమూరి వీరేంద్రనాథ్



## (గత సంచిక తరువాయి)

### అధ్యాయం –6

**అతడి** జీవితంలో ఇద్దరు స్త్రీలు రెండు రకాల నాటకాలతో అల్లరి చేయబోయి అతడికి దగ్గరయ్యారు. ఒకామె ఓడ మునిగిపోయిందన్న నాటకమాడి అతడి ప్రేమావేశంలో చిక్కుకుపోయింది. మరొకామె సెరబ్రల్ హెమరేజి అన్న ఎత్తు వేసి అతడి ముద్దు సంపాదించింది.చాలాకాలం క్రితం ఒక ఆంగ్ల చిత్రం వచ్చింది. దానిపేరు ‘‘క్లాష్ ఆఫ్ టైటాన్స్’’. ఇద్దరు దేవుళ్ళు మనుష్యుల్ని పావులుగా చేసి చదరంగం ఆడుకుంటుంటారు.

కళ్యాణి మాటిమాటికీ టైమ్ చూస్తోంది. ఇంకో నాలుగ్గంటల్లో కార్తికేయ రాబోతున్నాడు. ఆమె ఇక్కడ ఇలా ఆలోచనల్తో పూర్తిగా నిమగ్నమైనప్పుడు, ఆమెకి కొన్ని వేల మైళ్ళ దూరంలో అరేబియా సముద్రంలో కళ్యాణీ ఏజెన్సీస్ తాలూకు సరుకుని తీసుకువెళుతూన్న ఓడ ఒక వైపు ఒరిగిపోయి మునిగిపోవడానికి సిద్ధంగా ఉంది. ఆ ఓడ కెప్టెన్ ‘జట్టీసన్’ నిర్ణయం తీసుకున్నాడు. (ఓడ మునిగిపోతున్నప్పుడు ప్రాణాలు రక్షించటానికి ఓడ మునిగిపోకుండా, సరుకుల్ని సముద్రంలోకి తోసెయ్యటాన్ని ‘జట్టీసన్’ అంటారు). ఈ అధికారం కెప్టెన్‌కి ఉంది. దాదాపు కోటి రూపాయల విలువగల సరుకు ఆ విధంగా సముద్రంలోకి తోసివేయబడింది.

ఈ వార్త కళ్యాణికి బోంబే ఆఫీసు నుంచి టెలెక్స్ ద్వారా తెలియపర్చబడింది. కార్తికేయ ఢిల్లీలో విమానం ఎక్కుతున్న సమయానికి ఇక్కడ ఈ విషయం తెలిసింది.

ఒక్కక్షణం కళ్యాణి బ్లాంక్ అయింది. వెంటనే తేరుకుని ఇన్సూరెన్స్ కాగితాలు తెప్పించింది. అందులో జెట్టీసన్ క్లాజ్ లేదు. వెయ్యి కేసుల్లో ఒకటి అలాటి పొరపాటు (నిర్లక్ష్యం) జరుగుతుంది. తమ రోజువారీ కార్యక్రమాలు ప్రత్యక్షంగా చూసుకోకపోవటం వల్ల వచ్చిన పరిణామాల్లో మొట్టమొదటిది ఇది. నష్టం కోటి రూపాయలు.

ఉప్పెన వచ్చేముందు మొదట అంతా బాగానే ఉంటుంది. సన్నగా వర్షం వస్తూ ఉంటుంది. దూరంగా ఎక్కడో నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ ఒక శబ్దం వస్తుంది. నిముషాల్లో నీటిమట్టం పెరుగుతుంది. కన్నుమూసి తెరిచేటంతలో ఒక

కెరటం వచ్చి సమస్తాన్నీ తనలో తుడిచి పెట్టేస్తుంది. అలాటి కెరటం ఏదో దూరం నుంచి వస్తున్న భావాన్ని ఆమె మనసు శంకించింది. ఆమె గదిలో జనరల్ మానేజర్, ఇంకో నలుగురు ఎగ్జిక్యూటివ్స్ సమావేశమయ్యారు.

''కాష్ ఫ్లో ఎలా ఉంది?'' అడిగింది.

''మునిగిపోయిన సరుకుమీద అరవై లక్షలు బ్యాంక్‌కి చెల్లించాలి... ఇంకో పదిహేను రోజులు టైముంది. మిగతా నలభై లక్షలు... డిబెంచర్స్‌కి చెల్లించాలి.''

తలుపుమీద టక్ టక్ మని చప్పుడైంది. 'కమిన్' అంది కళ్యాణి. ఫైనాన్స్ మేనేజర్ తలుపు తోసుకుని లోపలికి వచ్చాడు. అతడి మొహం అదోలా ఉంది. ''ఏమైంది?'' అని అడిగింది.

''స్టాక్ బ్రోకర్స్ నుంచి కబురొచ్చింది. మన డిబెంచర్స్ చాలా భాగం ఈ రోజు అమ్ముడు పోయాయట.''

ఒక ఇరుకు ఫీలింగ్. కొద్దిరోజులలో చెల్లింపబడవలసిన డిబెంచర్లు ఈ రోజు ఎక్స్ఛేంజిలో 'మూవ్' అవటం ఏమిటి?

''ఎవరు కొన్నది?'' అడిగింది.

''సాల్మన్ అండ్ కంపెనీ.''

ఒక్కసారి ఆ గదిలో గాలి స్థంభించినట్టయింది. సాల్మన్ అండ్ కంపెనీ అంటే – శ్రీకళ్యాణి తయారీలకి పోటీగా రంగు ఉత్పత్తి చేసే సంస్థ. జెట్టీసన్ గురించి వాళ్ళక్కూడా తెలిసి ఉంటుంది. తమ సంస్థ రాబోయే ఇబ్బందుల్ని గుర్తించి, డిబెంచర్స్ కొనేశారు. గడువు దాటిన తరువాత ఒక్క రోజు కూడా ఆగరు. రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్‌కి ఫిర్యాదు ఇస్తారు. ఎటువంటి పరిస్థితుల్లోనైనా తాము డబ్బు చెల్లించాలి.

''సరే. గడువు తేదీ నాటికి సాల్మన్ కంపెనీ వారికి డబ్బు చెల్లింపబడేలా చూడండి. అంతకన్నా ఏం చేస్తాం? బ్యాంకు వాళ్ళని ఆగమని చెప్పండి'' అన్నది దీర్ఘంగా ఊపిరి వదుల్తూ.

''ఇందులో ఒక చిన్న సమస్య ఉంది మేడమ్. మన బ్యాంకు సరుకులోనే ఏదో అపసవ్యం ఉందనీ, బ్యాంక్‌ని మోసం చేశామనీ, ఆ బ్యాంక్ డైరెక్టర్లకి ఎవరో అనుమానం కలిగించారు...''

ఆమె మొహం ఎర్రబడింది. కోపం, నిస్సహాయత... ఆమె ఆలోచనల్ల నుంచి తేరుకుని, ''మనం ఇంకో బ్యాంకు నుంచి ప్రయత్నిద్దాం'' అంది.

''కాస్త టైమ్ పడుతుంది మాడమ్.''

''ఫర్వాలేదు. ఆ విషయం నేను చూసుకుంటాను. మీరు ఈ డిబెంచర్ల చెల్లింపు విషయంలో ఏమీ జాప్యం చేయకండి. గడువు తేదీ నాటికి అందరికీ డబ్బులు ఇచ్చెయ్యండి. ఎంత డబ్బు కావాలో మన చిట్ ఫండ్ కంపెనీ నుంచి తీసుకోండి.''

ఆ సమయానికి కార్తికేయ మెట్లెక్కి పైకి వస్తున్నాడు. అతడికి అక్కడి వాతావరణమంతా అదోలా అనిపించింది. బయట చాలా కార్లు ఉండటంతో ''లోపలెవరున్నారు?'' అని అడిగాడు. నౌఖరు చెప్పాడు. దాంతో అతడు రూం బయటే

కూర్చుండి పోయాడు. మీ పడగ్గదిలోకి మీరు వెళ్ళటానికి ఏముంది అన్నట్టు, ''లోపలికి వెళ్ళండి బాబూ'' అన్నాడు నౌఖరు. ''లేదులే'' అన్నాడు కార్తికేయ.

లోపల శ్రీకళ్యాణి – ''సరే మీరు వెళ్ళండి. వారంరోజుల్లో వచ్చే ఇమ్మీడియట్ ఇబ్బంది ఏమీ లేదుగా'' అంది.

''ఉంది మేడమ్.''

ఆమె మొహం చిట్లించి, ''ఏమిటి?'' అని అడిగింది.

''చిట్‌ఫండ్ కంపెనీ ఇన్వెస్టుమెంట్స్ ఇంకో నాలుగు రోజుల్లో మెచ్యూర్ అవుతున్నాయి. వాళ్లకి డబ్బు ఇవ్వాలి.''

అయిపోయింది. పెద్ద శబ్దంతో వచ్చిన ఉప్పెన సర్వం ఊడ్చి పెట్టుకుపోయింది. శిథిలాలని చూసుకోవటం మాత్రమే మిగిలి ఉంది. చిట్‌ఫండ్ డిపాజిట్లు చెల్లించటం ఒక్కరోజు ఆలస్యమయితే, ఆ విషయం పని గట్టుకొని శత్రువులు ప్రచారం చేస్తే క్షణాలలో అందరూ తమ మీద దండెత్తుతారు. ఒక్కసారి నమ్మకం పోతే చిట్‌ఫండ్ కంపెనీ నాలుక గీసుకోవటానికి కూడా పనికిరాదు.

క్షణాలు నిముషాలయ్యాక... ''వెళ్ళొస్తాం మాడమ్'' అన్నారు వాళ్ళు. ఆమె మాట్లాడలేదు. వాళ్ళు నిశ్శబ్దంగా కదిలిపోయారు. కొన్ని క్షణాల తరువాత కార్తికేయ లోపలికి వచ్చాడు. అన్నాళ్ళు – అన్నేళ్ళుగా ఫీలయిన ఉద్వేగంతో అతడు దగ్గరకు వచ్చి నుదుటిమీద ముద్దిడి – ''ఎలా ఉన్నావ్ కళ్యాణీ'' అని అడిగాడు.

*'డామిట్, ఆ సాల్మన్ కంపెనీ'*

''ఏమిటి? ఇక్కడే మీటింగ్ ఏర్పాటు చేశావు? ఏదైనా ముఖ్య విషయమా?'' అని అడిగాడు. ఆమె నవ్వటానికి ప్రయత్నించి ''లేదు'' అంది. అతడు వంగి, ఆమె ముంగురుల్ని ముద్దుపెట్టుకున్నాడు.

*ఏం చెయ్యాలిప్పుడు?*

''నీ గురించి ఢిల్లీ నుంచి ఏం తెచ్చానో తెలుసా? చక్రాల కుర్చీ. చాలా స్పెషల్. ఇక నువ్వు ఇల్లంతా తిరగొచ్చు. తోటలో తిరగొచ్చు.''

*సాల్మన్ కంపెనీ వాళ్ళందరూ ఏం చేస్తూ ఉండి ఉంటారిప్పుడు?*

''నువ్వేమిటి ఇంత నిశ్శబ్దంగా ఉన్నావ్?'' అంటూ అతడామె చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుని పెదవులకి ఆనించుకున్నాడు. ''ఈ రాత్రి మనం తోటలో సెలబ్రేట్ చేసుకుందాం కళ్యాణీ.''

*ఆ కంపెనీ ఎగ్జిక్యూటివ్స్ అందరూ హోటల్లో చేరి ఈ రాత్రి ఈ పండగని సెలబ్రేట్ చేసుకుంటూ ఉండి ఉంటారా?*

ఆమె చేతుల్ని అప్రయత్నంగా వెనక్కి తీసుకుంది. అది అతడు గమనించాడు. ఉద్విగ్నంగా ''కళ్యాణీ... నీ చేతులు... నీ..చే..తు..లు'' అని అడిగాడు

''అవునండీ. రెండ్రోజుల క్రితం స్వాధీనంలోకి వచ్చాయి.''

''మరి ఫోన్‌లో చెప్పలేదేం?''

''ఒక్కసారిగా ఆశ్చర్యపరుద్దామనుకున్నాను.''

అతను పిచ్చివాడిలా ఆమె మెడనీ, చెంపల్నీ అతిశయించిన ఆనందంతో ముద్దు పెట్టుకొంటూ ''ఇంత మామూలుగానా చెప్పడం'' అన్నాడు.

*'ఒక గంట ముందుగానీ మీరొచ్చి ఉంటే ఊహించలేనంత థ్రిల్లింగ్‌గా చెప్పి ఉండేదాన్ని'*

అతడు తన ఆనందాన్నీ, ఆవేశాన్నీ, ఉద్వేగాన్నీ అణచుకోవటం కోసమా అన్నట్టు ఆమె వక్షం మీద కళ్ళు మూసుకొని పడుకొని ఉన్నాడు. అతడి నుంచి ఆమె తన చేతుల్ని పైకి తీసుకొని తేరిపార చూసుకొంది. ఈ చేతులతో తన భర్తకి రొమాంటిక్‌గా థ్రిల్ కలుగచేద్దామనుకొంది. ఇప్పుడిక రొమాన్సు లేదు. రొమాన్సులో థ్రిల్ లేదు. ఈ చేతులు ఇప్పుడు అక్కడ హోటల్‌లో తాగుతూ తన మీద జోకు లేసుకుంటూ ఉన్న ప్రత్యర్థులకి పాఠాలు చెపుతాయి. ..!

## 2

**మైక్** లోంచి మంగోలియన్ భాష నెపంతో కార్తికేయ నుద్దేశించి 'ఐ లవ్యూ' అని చెప్పేశాక ఎయిర్‌పోర్ట్ బయటకొచ్చి పార్క్ చేసి ఉన్న కార్లో కూర్చుంది అనూజ్ఞ. అయితే కారు స్టార్టు చేయలేదు. అప్పటివరకూ ఉన్న హుషారు ఎవరో చేత్తో తీసేసినట్టు పోయింది. ఆమెకి తన క్లాస్‌మేట్ సంపత్ గుర్తొచ్చాడు. అతడి గర్ల్‌ఫ్రెండ్ గుర్తొచ్చింది. ఒకసారి తామందరూ ఎన్.సి.సి. కోసం నెలరోజులు రాజస్థాన్ వెళ్ళాల్సి వచ్చింది. బస్ దగ్గరకి సంపత్ స్నేహితురాలు కూడా వచ్చింది. ఇద్దరూ వ్యాను పక్కన నిలబడి మాట్లాడుకున్నారు చాలాసేపు. వ్యాన్ బయల్దేరాక సంపత్ తామందరితో జోక్‌చేస్తూ కూర్చుంటే అడిగింది. ''ఇంత సంతోషంగా ఎలా ఉండగలుగుతున్నావ్ సంపత్. నువ్వు పెళ్ళి చేసుకోబోతున్న అమ్మాయిని నెలరోజులు వదిలి ఉండాల్సి వస్తోంది గదా.''

''నువ్వయితే ఏం చేస్తావ్?'' సంపత్ నవ్వుతూ అడిగాడు.

'బస్ ఆగిన ప్రతి స్టేషన్‌లోనూ దిగి ఢిల్లీ ఎస్‌టిడి చేసి ఉండేదాన్నేమో' అనుకుంది మనసులో.

విమానం గాలిలో లేచేసరికి ఆమె అటు చూస్తూ ఉండిపోయింది. ఆమెకి ఆ విమానాన్ని చూస్తే అసూయ కలిగింది. అతడిని తనలో ఇముడ్చుకొని వెళ్ళిపోతున్నందుకు. దూరంగా మేఘాల మధ్య విమానం చిన్న పక్షిలా కనబడుతోంది. అతనేం చేస్తూ ఉంటాడు లోపల? అద్దాల్లోంచి వెనక్కి వెనక్కి తన కోసం చూస్తూ ఉంటాడా?

కదిలే రైలు కిటికీలోంచి మిత్రుడి మొహం కనపడటం మానెయ్యగానే చెయ్యూపడం ఆపటం కాదు వీడ్కోలంటే. ఆఖరి పెట్టె కనుమరుగయ్యేంత వరకూ చేష్టలుడిగి నిలబడి, ఏదయినా అద్భుతం జరిగి రైలు వెనక్కి వస్తుందేమో అని ఆశపడి, విడదీసే రైలుమీద మండిపడి, ఖాళీ ప్లాట్‌ఫాంని చూసుకొని దుఃఖపడి... వెనుదిరగడం.

వెళ్ళిపోతున్న విమానం పోతున్న ప్రాణంలా ఉంది. ఆమె అనుకుంది. ''నా వృద్ధాప్యం లో... మనవలు, మనవరాళ్ళు అందరూ నా పడక చుట్టూ చేరి ఉంటారు. కొడుకులూ, కోడళ్ళు దిగులుగా నా వైపు చూస్తూ ఉంటారు. మృత్యువు నా ప్రక్కన నవ్వుతూ నిలబడి *'గుండెల్నిండా చివరిసారిగా హాయిగా ఊపిరితీసుకో. ఇదే నీ ఆఖరి శ్వాస'* అంటుంది. నేను నవ్వుకుంటాను. మృత్యువు ఆశ్చర్యపోతుంది. దానికేం తెలుసు. నేనొక్క క్షణం ఎక్కువ బ్రతుకుతానంటే ఆ క్షణం గుండెల్నిండా ఊపిరికి బదులు నీ జ్ఞాపకం నింపుకుని మరణిస్తానని.''

ఆమె చాలాసేపు అలాగే కూర్చుని చివరికి కారు స్టార్టు చేసింది. ఇంటికి వెళ్ళబుద్ధి కాలేదు. రాష్ట్రపతి నివాసం ప్రక్కనుంచి విశాలమైన వీధుల గుండా వెళ్తుండగా వచ్చింది ఆమెకి ఆలోచన. కారు తన యూనివర్శిటీ వైపుకి తిప్పింది. థియేటర్ డిపార్టుమెంట్‌లో స్టూడియో ఖాళీగానే ఉంది. దాని ఇన్‌ఛార్జ్ సంపత్‌ని ''నాకో సాయం చేస్తావా?'' అని అడిగింది.

''ఏమిటి?'' అన్నాడు.

ఆమె తనేం చెప్పదల్చుకున్నదో చెప్పింది. సంపత్ అదిరిపడి ''నీకు మతిపోయింది'' అన్నాడు. ఆమె నవ్వి ''అవును ప్రేమలో పడ్డానుగా'' అంది.

''మనం స్టూడియోని ఇలా వాడుకున్నామని ఎవరికయినా తెలిస్తే.''

''ఓ పదిరోజులు సస్పెండు చేస్తారు. లేదా ఓ రెండువేలు ఫైన్ వేస్తారు. ప్రేమ కోసం ఆ మాత్రం చెయ్యలేమా ఏమిటి?''

''ఏమిటి అలా ఉన్నావు?'' అన్నాడు కార్తికేయ ఆమె వక్షంమీద నుంచి తలెత్తి.

కళ్యాణి తెప్పరిల్లి ''ఏమీలేదే'' అంది.

''లేదు. ఏదో ఉంది. నీకు చెప్పటం ఇష్టం లేకపోతే వద్దులే.''

అతడి జుట్టులోకి చేతివేళ్ళు జొనిపి మొహాన్ని దగ్గరకి లాక్కుని ముద్దుపెట్టుకుని ''చేతులు స్వాధీనంలోకి వచ్చాక మిమ్మల్ని పెట్టుకున్న మొదటి ముద్దు ఇది. బావుందా?'' అని అడిగింది.

''బావుంది. కానీ ముద్దు పెట్టుకోవడానికి తన తాలూకు రెండు పెదాలు చాలనుకున్నాను. చేతులు కూడా అవసరమని ఇప్పుడే తెలిసింది'' అన్నాడు ఒకప్పటి ఆమె మాటల్ని తిప్పికొడుతూ. ఆమె తక్కువేమీ తినలేదు. ''అయితే రొమాన్స్‌కి చేతులు అవసరం లేదంటారు. మీరు డాన్ క్విక్సోట్స్ తమ్ముడిలా ఉన్నారే.''

''అతనెవరు?''

''పరమ బద్ధకిష్టు. అన్నట్టు ఈ ప్రపంచంలో అందరికన్నా పరమ బద్ధకిష్టు ఎవరో తెలుసా?''

''ఎవరు?''

''కడుపుతో ఉన్న అమ్మాయిని పెళ్ళి చేసుకునేవాడు.''

ఆ సెటైరు అతనికి అర్థమై కదిలాడు. ఆమె కెవ్వున కేకవేసి ''మైగాడ్, ఇంకెప్పుడూ అనన్లెండి. చెయ్యి తియ్యండి'' అంది.

''బద్ధకిష్టు సంగతి సరే ఈ ప్రపంచంలో అందరికన్నా దురదృష్టవంతుడు ఎవరో తెలుసా?'' అడిగాడు.

''ఎవరు?'' అంది.

''వెళుతూ వెళుతూ కాస్త నైటీ క్రిందికి లాగేసి వెళ్ళండి' అనే ఆవిడ మొగుడు" అంటూ, మాట పూర్తికాకుండానే ఈసారి అరవటం అతని వంతు అయింది. కానీ ఆమె వెంటనే సర్దుకుని మంద్రంగా ''ఈ ప్రపంచంలో అందరికన్నా దురదృష్టవంతుడు ఎవరో తెలుసా?'' అంది.

''ఎవరు?''

''మీరే.''

అతడు చివుక్కున తలెత్తి ''ఛా ఛా'' అన్నాడు. ఆమె అదే దిగులు స్వరంతో ''చూడండి నేను మీకేమీ చెయ్యలేకపోతున్నాను. మీరు హాయిగా పడుకుని రిలాక్స్ అవుతోంటే కనీసం పైకొచ్చి ముద్దు కూడా పెట్టలేకపోతున్నాను'' అంది.

వాతావరణాన్ని తేలికపర్చడం కోసం అతనన్నాడు. ''ఎవరు చేసే పని వాళ్ళే చేయాలి. పై నుండి ముద్దు పెట్టుకోవడంలో ఆనందం నీకేం తెలుసు? నీకో కవిత చెప్పనా? కదిలే వేళ్ళతో వచ్చే మూలుగు అందం కదిలించేవాడికే తెలుస్తుంది. కడుపు కింద ముద్దు అందం క్రిందనున్న వారికే తెలుస్తుంది. ముడతల్లో నాలుక మడతల అందం నాభి నరాలకే తెలుస్తుంది.''

''మై...గా...డ్'' కళ్ళు పెద్దవిచేసి అన్నది. ''అసలు మీరు కార్తికేయేనా అని నా కనుమానంగా ఉంది.''

''ఎందుకో?''

''ఎప్పుడూ అంత సీరియస్ గానూ, బుద్ధుడిలాగానూ ఉండేవారు కాబట్టి. ఇంత హుషారుగా మిమ్మల్ని ఎప్పుడూ చూడలేదు.''

''అందరితోనూ హుషారుగా ఉండి మనతోనూ ఇలాగే ఉంటే ప్రత్యేకత ఏముంది? అందరి దగ్గరా ముభావంగా ఉండి మన దగ్గర జోవియల్‌గా ఉంటే 'ఇతడు మన మనిషి' అనిపిస్తుంది'' అంటూ అతడు హుషారుగా ఆమె మెడమీద మంచి క్రిందికి పాకాడు.

''అవును ఆ విషయం నేను గమనించలేదు సుమా'' అంటూ అతడి మెడ వెనకగా చెయ్యి వేసింది. సందుల్లోంచి వచ్చే గాలికి, కిటికీ తెర ఇబ్బందిగా కదిలింది.

‘‘అందరి పద్ధతిలోనే మనమూ ఉంటే ఏం బావుంటుంది చెప్పండి? అందుకే నా ప్రేమలేఖని వీడియోలో పంపుతున్నాను. టైటిల్స్‌లో కృతజ్ఞతలు వేసినట్టు వెయ్యాలంటే సంపత్ పేరు వెయ్యాలి. యూనివర్శిటీ స్టూడియోలో, వాళ్ళ లైబ్రరీ క్యాసెట్లన్నీ వాడుకుంటూ, దొంగతనంగా రికార్డు చేస్తున్నాం. మన బాబుకి తన పేరు పెట్టుకునే షరతు మీద డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ సంపత్ దీనికి ఒప్పుకున్నాడు. అదిగో అద్దాల అవతల్నుంచి కోపంగా చూస్తున్నాడు.’’ నవ్వింది.

కోణార్క్ శిల్పంమీద కెమేరా కదులుతోంది. ఒక అపురూప భంగిమలో పురుషుడు స్త్రీని కౌగిలించుకున్నట్టు ఉన్న శిల్పం అది. చక్కటి క్లోజప్‌లో వారిద్దరి అత్యంత సామీప్య వదనాల మీద నుంచి క్రిందికి పాకుతోంది కెమేరా. పురుషుడి హస్తం స్త్రీ వెనుకనుంచి భుజం క్రిందుగా వక్షోజాన్ని పట్టుకుని ఉంది. ఆ స్త్రీ తమకంతో ఒక కాలు కొద్దిగా గాలిలోకి లేపి కళ్ళు మూసుకుంది.

అనూజ్ఞ గొంతు సవరించుకుని ‘కార్తికేయా’ అంది. అని వెంటనే సిగ్గుపడింది. మళ్ళీ అంతలోనే ధైర్యం తెచ్చుకుని మాట్లాడటం ప్రారంభించింది. ‘‘ఇదంతా నాకు సిల్లీగానూ, చిన్నపిల్లల ఆటగానూ కనిపిస్తోంది. కనిపించడం ఏమిటి నా మొహం అలాగే ఉంటేను.’’

ఆమె వెనుక కనబడుతున్న కోణార్క్ శిల్పం తాలూకు బొమ్మ మాయమై ఒక పావురం ఉత్తరాన్ని తీసుకువెళ్తున్న దృశ్యం వచ్చింది. ఆమె కొనసాగించింది. ‘‘మనసులో భావాలు ఆత్మీయులతో చెప్పడానికి పూర్వకాలం ఉత్తరాలే వాడేవారు. నా స్నేహితుడికి ఇంకా అందంగా చెప్పాలనుకున్నాను. అందుకే ఉత్తరాన్ని కంఠతా పట్టి ఎదురుగా నిలబడి చెప్పేశాను. కానీ ఇప్పుడు నా కంఠం వినిపించనంత దూరంలో ఉన్న ఫ్రెండ్‌కి ఎలా చెప్పను? అందుకే ఆలోచించాను. ఒక కొత్తరకంగా మరో వినూత్న పద్ధతిలో చెప్పాలనుకున్నాను. ఏ పద్ధతిలో చెపుతున్నానన్నది కాదు ఇక్కడ. ఈ క్యాసెట్ మీరు వీడియోలో పెట్టుకుని చూస్తుంటే... అదిగో మీరు నవ్వుతున్నారు. థాంక్స్. ఇంతదూరం నుంచి కూడా మా మిత్రాజీ పెదవుల మీద నవ్వు తెప్పించగలిగాను అంటే అంతకన్నా ఏం కావాలి?’’

వెనుక ఎలక్ట్రానిక్ ఎక్స్ఛేంజ్‌లోంచి కెమేరా వెళుతోంది. క్రోమోలో వెనుక జలపాతాలూ, నదీప్రవాహాలు, తోటలూ కనబడుతున్నాయి. అక్కడ నుంచి ఒక వరుసగా ఆమె భావాలతో ప్రతిస్పందిస్తూ వెనుక దృశ్యాలు మారసాగాయి. ‘‘అందమైన బంధాన్ని ఇలా ఎలక్ట్రానిక్ పద్ధతిలో మెకానికల్‌గా చెబుతున్నా నేమిటా అని అనుకోకండి మిత్రాజీ. భావం భావుకత అయినప్పుడు విధానం వీడియో అయితేనేం.’’

వెనుక వీడియోలో పున్నమి వెన్నెల నదిమీద పడుతోంది. అలలు కూడా నిద్రపోతున్నట్లు ఉన్నాయి. ఆమె స్వరం మంద్రంగా పలికింది. ‘‘గాలి తన చేతులతో అలవోకగా నదీ కెరటాన్ని నిద్ర లేపినట్టు నీ జ్ఞాపకం నా పెదవుల మీద నవ్వు తెచ్చి కదుపుతోంది. నేను నీతో కలవటం ఒక ఆనందం కాదు. అద్వైతం. మన పరిచయం చెట్ల వేళ్ళ కొసల్నుంచి ప్రారంభమై స్నేహం కొమ్మల కొసల్లోకి ప్రయాణించి, ప్రేమ ఫలాన్ని కాయబోతోందని తల్చుకుంటేనే గుండె గదికి ఆనందం

వెల్ల వేసినట్టుంటుంది. నీకు తెలుసా? నేను నీ గురించి ఆలోచిస్తూ ఒక అలౌకికమైన స్థితిలో రుష్యత్వాన్ని పొందుతాను. నాకు తపోభంగం కలిగిస్తూ అక్కడ కూడా నువ్వు గోచరిస్తావు. గులాబీ మీద నిల్చున్న మంచు బిందువు తన మీదకు ఎప్పుడు రాలుతుందా అని రాత్రంతా ఎదురుచూసే గడ్డిపరకలా నేను నీ కోసం ఎదురు చూస్తాను. నీ తలపులు, నా గుండె తలుపుల్ని తీసుకుని చాలా స్వతంత్రంగా లోపలికి వెళ్ళిపోవడం నేర్చుకున్నాయి. వసంతాలన్నీ వర్షాలుగా, వర్షాలన్నీ శిశిరాలుగా మారిపోతున్నాయి. ఆనందాలు అరవిందాలవుతున్నాయి. నా మనోతటాకంలో నీ తలపు ఇందిందరమై ఇందీవరమై... సరమై... సంబరమై... ముమ్మరమై... అంబరమై...' లెవెల్స్ కంట్రోల్ చేస్తున్న సంపత్ ఆశ్చర్యంగా తలెత్తాడు. ''నీ ఊహ నాలో కంపనమై, కందరమై, రంజనమై, మనోరంజనమై'' సంపత్ కంట్రోల్ చేయడం మానేశాడు. ఆమె అక్కడలేదు. ఎక్కడో ఉన్నది. ఆమె స్వరలయకి కంట్రోలు ముల్లు లయబద్ధంగా తిరుగుతోంది. ''నా మనోనందనంలో అంకురమై... శింజితమై... కంజరమై... మంజరమై అజరామరమై.'' ఆమె కంఠం వణుకుతోంది. ''నువ్వే నాకు భరణమై, శంకరాభరణమై, ఇంధనమై, వింధ్య పర్వతమై సం–గీ–త–మై–సం–వే–ద–మై''

ఒక్కసారిగా నిశ్శబ్దమవడంతో సంపత్ లోపలికి తొంగి చూశాడు. లైట్లమధ్య కెమేరా ముందు కూలిపోయి ఉంది అనూజ్ఞ.

''మనం అలా బైట తిరుగుదాం'' అన్నాడు కార్తికేయ.

''ఇంత అర్ధరాత్రా'' అనలేదు కళ్యాణి. బయట తిరగాలన్న ఉత్సాహం కన్నా ఆ బెడ్‌రూంలోంచి బయటపడాలన్న కోరిక ఎక్కువగా ఉంది ఆమెకి. అతడు కుర్చీ విప్పి ఏర్పాటు చేసి జాగ్రత్తగా కూర్చోబెట్టాడు. క్రిందికి తీసుకురావటం కష్టమైంది.

కుర్చీ తోసుకుంటూ బయట తోటలోకి వచ్చాడు. చల్లటి గాలి రివ్వున మొహానికి తగిలి అదోలాటి స్వాంతన కలుగచేసింది. అప్పటివరకూ బెడ్‌రూంలో ఉన్న ఇరుకుతనం పోయినట్టు అనిపించింది. అతడు తోట లోపలికి కుర్చీ తీసుకు వెళుతూ ''రేప్పొద్దున నేనొకసారి హాస్పిటల్‌కి వెళ్ళాలి'' అన్నాడు.

''ఎందుకు?''

''సాయంత్రం విమానంలో నా ప్రక్కన ఓ మినిష్టరుగారు కూర్చున్నారు. ఆయనకి వెర్టిగో ఉన్నట్టుంది. కంగారు చేశారు. కొంచెం ప్రథమ చికిత్స చేయాల్సి వచ్చింది. ఆస్పత్రికి వచ్చి చూస్తానన్నాను.''

''పేరు''

''వివేకానంద.''

''ఆయన కూతురు మరణించిందన్నారు. తరువాత కాదని తెలిసింది. అసలేం జరిగింది?''

“ఓ అదా. అసలు సిమ్లాలో ఏం జరిగిందంటే...” అతడు ఎదురుగా ఉన్న దృశ్యం చూసి చెప్పడం ఆపుచేశాడు. ఆమె కూడా అటు చూసింది. దూరంగా చెట్ల సందుల్లో– మోటార్ బావినుంచి కొబ్బరిచెట్లకు వెళ్ళే నీటి కాలువగట్టు పక్కనున్న పొదవాటి రాయిమీద ఉన్నారు వారిద్దరు. డ్రైవరూ, పెర్సనల్ మేనేజర్ భార్యా. ఈ లోకంతో నిమిత్తం లేకుండా ఆనందిస్తున్నారు. వాళ్ళ వంటిమీద వెలుగు తప్ప మరేమీలేదు. సవ్వడి కాకుండా చక్రాల కుర్చీ వెనక్కి తిప్పాడు కార్తికేయ.

“ఇడియట్. ఆ డ్రైవర్ని రేపే ఉద్యోగంలోంచి తీసేస్తాను” ఇంట్లోకి ప్రవేశిస్తుండగా అంది కళ్యాణి.

“ఎందుకు?”

ఆమె చివుక్కున తలెత్తి “ఎందుకా? ఆవిడెవరో తెలుసా? పెర్సనల్ మేనేజర్ భార్య.” అతడు నవ్వాడు. “మనిద్దరి మధ్య మొదటి సంభాషణ దీని గురించే జరిగింది. మర్చిపోయావా కళ్యాణీ.”

ఆమె గతుక్కుమని వెంటనే తేరుకుని “అవును. అప్పుడలా అన్నాను. నిజమే. అభిప్రాయాలు ఎప్పుడూ ఒకేలా ఉంటాయా ఏమిటి? భార్యకి భర్తకి ఉన్న అనుబంధం గురించి ఆ రోజుల్లో నాకు తెలీదు” అంది. అతడు మాట్లాడలేదు. చక్రాల కుర్చీ క్రిందే వదిలేసి ఆమెని చేతుల మీద లేపి మెట్లెక్కి పైకి తీసుకొచ్చి పక్కమీద పడుకోబెట్టాడు. దాదాపు రెండు గంటలయిన తరువాత ఆమె నెమ్మదిగా “ఏమండీ” అంది.

‘ఊ’ అన్నాడు. ఆమె ఆశ్చర్యంగా “ఇంకా మీరు నిద్రపోలేదా? రెండు కావస్తోంది” అంది.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments